క్లుప్తంగా...

ఘనంగా వైఎస్.జగన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వైసీపీ రాష్ట్ర నాయకులు మెట్టు రాఘవేంద్ర, మెట్టు శ్రీకాంత్

అబిడ్స్: గోషామహల్ ఆగాపురా ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర నాయకులు మెట్టు రాఘవేంద్ర, మెట్టు శ్రీకాంత్ కేక్ కట్ చేశారు. అలాగే స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్.జగన్ హయాంలోనే ఆంధ్రప్రదేశ్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



నృత్యం చేస్తున్న దీప్తి సరోజిని

గన్‌ఫౌండ్రీ: సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్య గురువు వి.పద్మ కల్యాణ్ శిష్యురాలు డాక్టర్ టీఎస్. దీప్తి సరోజిని కూచిపూడి నాట్య రంగప్రవేశం శనివారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో జరిగింది. అనిరుద శబ్దం, పూజా నృత్యం, భామ కలాపం, జయజయ వైష్ణవి దుర్గే వంటి పలు అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పద్మభూషణ్ డాక్టర్ స్వప్నసుందరి మాట్లాడుతూ.. మోకాలికి శస్త్రచికిత్స జరిగిన తర్వాత కూడా కూచిపూడి నాట్యం నేర్చుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాట్య విశారద అనుపమ మోహన్, అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటర్ కార్డుకు ఆధార్ లింక్ చేయాలి

చార్మినార్: ఓటర్ కార్డుకు ఆధార్ లింక్ చేస్తే బోగస్ ఓట్లను తగ్గించవచ్చని, ఈ మేరకు తమ సూచనను కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పంపించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ సరిత నియోజకవర్గంలోని అఖిలపక్ష పార్టీల నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు మీర్ హైదర్ అలీ జాఫరీ, నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది, మజ్లిస్ నాయకులు సమావేశంలో పాల్గొని తమ సలహాలు సూచనలను అందజేశారు.

నిషేధిత చైనా మాంజా స్వాధీనం

విజయనగర్‌కాలనీ: నిషేధిత చైనా మాంజాను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన ఘటన శనివారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆసిఫ్‌నగర్ పీఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ కే విజయ్ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మంగళ్‌హాట్‌కు చెందిన వినయ్‌రాజ్ సింగ్, అనూప్ సింగ్, శంకర్‌సింగ్ నిషేధిత చైనా మాంజ రెండు కాటన్లతో ఆసిఫ్‌నగర్ జిర్రా రోడ్డులోని సిటీ డైమాండ్ హోటల్ వద్ద ఉన్నారు. ఆసిఫ్‌నగర్ పెట్రోలింగ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా చైనా మాంజా ఉన్నట్లు గుర్తించారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా మంగళ్‌హాట్ ప్రాంతంలోని వారి నివాసంలో 426 నిషేధిత చైనా మాంజ బాబిన్స్ దొరికాయి. నిందితులను, మాంజాను ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమావేశంలో ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ జీ వెంకటేశ్వర్లు, అడ్మిన్ ఎస్ఐ.కే శ్రీనివాస్ తేజ పాల్గొన్నారు.

భవనం పనుల పరిశీలన

దూద్‌బౌలి: హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో దూద్‌బౌలిలో చేపట్టిన నూతన భవనం పనులను గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.ఉపేందర్ రెడ్డి పురానాపూల్ డివిజన్ కార్పొరేటర్ సున్నం రాజమోహన్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.. భవనాలు లేని చోట్ల కొత్తవి నిర్మిస్తున్నామన్నారు. హైదరాబాద్ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ, సెక్షన్ ఇన్‌చార్జి సుకేశ్ కుమార్, గ్రంథపాలకుడు చంద్రశేఖర్, సాయి కిరణ్, అమిర్ తదితరులు పనుల వివరాలను ఆయనకు వివరించారు.

పనులు ప్రారంభం

గౌలిపురా: శ్రీ మంగళముఖి హనుమాన్ ఆలయ ముఖద్వారానికి నూతన ఎస్.ఎస్.గేట్ పనులను గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎం.నర్సింగ్ రావు, ప్రభాకర్ రావు, ఎ.మురళీకాంత్, తరుణ్ కుమార్, కీర్తన్, క్రాంతి కుమార్, బీజేపీ నాయకులు జీ.రఘుకాంత్, ఈ.సుమన్ కుమార్ ముదిరాజ్, జమాల్‌పూర్ అశోక్, బీ.రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగపై కేసు నమోదు

నాంపల్లి: మందకృష్ణ మాదిగపై నాంపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనెల 1న జరిగిన మాలల సింహగర్జనకు హాజరైన వారిని కించపరుస్తూ మందకృష్ణ మాదిగ ఈనెల 2న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ రెడ్‌హిల్స్ జంగంబస్తీకి చెందిన మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాం ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

ఫుట్‌పాట్లు..!



పాత ముంబాయి జాతీయ రహదారి ఫుట్‌పాత్‌పై నిలిపిన కార్లు



టోలిచౌకీ ప్రధాన రహదారిపై నిలిపిన ద్విచక్ర వాహనాలు

- యథేచ్ఛగా ఆక్రమణ
- ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్
- పాదచారులకు తప్పని తిప్పలు
- పట్టని అధికారులు

గోల్కొండ: ట్రాఫిక్, బల్దియా అధికారుల నిర్లక్ష్యంతో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. అక్రమ పార్కింగ్‌లను అడ్డుకోవాల్సిన ట్రాఫిక్ పోలీసులు.. ఫుట్‌పాత్‌లపై వెలిసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, డబ్బా హోటల్స్ తొలగించడంలో నిర్లక్ష్యం చేస్తున్న బల్దియా అధికారుల తీరుతో లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఫుట్‌పాత్‌లు పాదచారులకు మాత్రం ఉపయోగం లేకుండా పోతోంది. కొన్ని ప్రాంతాల్లో స్థానిక నాయకుల అండదండలతో కొందరు ఫుట్‌పాత్‌లు కబ్జా చేసి అక్రమంగా అద్దెలకు ఇస్తున్నట్లు కూడా తెలిసింది. ముఖ్యంగా టోలిచౌకీ, నానల్‌నగర్, మెహిదీపట్నం, పాతముంబాయి జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో రోడ్డుకిరువైపులా ఉన్న రెస్టారెంట్లు, మాల్స్ ఎదుట ఉన్న ఫుట్‌పాత్‌లపైనే వాహనాలను నిలిపేస్తున్నారు. దీంతో పాదచారులు కనీసం నడిచేందుకు వీల్లేని పరిస్థితులు నెలకొంటున్నాయి.

వాణిజ్య అవసరాలకు సెల్లార్లు..

గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, షేక్‌పేట్ పాత ముంబాయి జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాల్లో ఎన్నో మాల్స్ వెలిశాయి. వీటిలో చాలా వాటికి సెల్లార్లు లేవు. ఉన్నవాటిని అద్దెకు ఇస్తున్నారు. షేక్‌పేట్ నాలా వద్ద గల పాస్‌పోర్టు సేవా కేంద్రం భవనంలో ఎన్నో షోరూంలు ఉన్నాయి. ఇందులోకి వచ్చే కస్టమర్లకు సరైనా పార్కింగ్ సౌకర్యం లేదు. దీంతో గత్యంతరం లేక వాహనాదారులు మెయిన్ రోడ్డుపైనే వాహనాలను నిలిపేస్తున్నారు. మెహిదీపట్నం బస్టాప్, షేక్‌పేట్ డీమార్ట్, గుడిమల్కాపూర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాల వద్ద కూడా ఇదే పరిస్థితి. కాగా ట్రాఫిక్ పోలీసులు, బల్దియా వారు నామమాత్రంగా చేపడుతున్న చర్యలతో కొద్దిరోజులు బాగానే ఉన్నా.. తర్వాత మళ్లీ యథావిధిగా ఫుట్‌పాట్ ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నడిచేందుకు వీలుగా ఫుట్‌పాట్లు ఉండేలా చూడాలని పాదచారులు కోరుతున్నారు.

ఐపీజీడీసీలో శ్రీనివాస రామానుజన్ జయంతి



శ్రీరాములును సత్కరిస్తున్న చంద్రముఖర్జీ, చిత్రంలో డాక్టర్ గీతాంజలి

నాంపల్లి: శ్రీనివాస రామానుజన్ 137వ జయంతిని పురస్కరించుకుని ఇందిరాప్రియదర్శిని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్ర ముఖర్జీ అధ్యక్షతన శనివారం జాతీయ గణిత దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ప్రొఫెసర్ ఎ.శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరై రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే జాతీయ గణిత దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాంజలి, హెచ్ఓడి శ్రీదేవి, డాక్టర్ మంగిరీష్ పాల్గొన్నారు.

సెమినార్లకు వేదికవ్వడం గర్వకారణం



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

గోల్కొండ: అంతర్జాతీయ సెమినార్లు, అవగాహన కార్యక్రమాలకు తమ కళాశాల వేదికగా నిలవడం గర్వంగా ఉందని షేక్‌పేట్‌లోని జీ నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే రమేశ్‌రెడ్డి అన్నారు. కళాశాలలో ఎన్‌హ్యాన్సింగ్ డయాగ్నోస్టిక్స్ ప్రెసిషన్.. ఏ డీప్ లెర్నింగ్ పవర్డ్ ఇంటలిజెంట్ సిస్టమ్ ఫర్ రేటినల్ వేయిన్ అక్లూషన్ డయాగ్నోస్టిక్స్ తదితర అంశాలపై రెండు వారాల పాటు కొనసాగిన కార్యక్రమం శనివారం ముగిసింది. అటల్ ఏఐసీటీఈ సౌజన్యంతో జరిగిన ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగాం జీఎన్ఐటీఎస్ సీఎస్ఈ విభాగం వారు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థినులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, ఐఐటీ హైదరాబాద్, నియో రేటిన ఐ కేర్ ఇనిస్టిట్యూట్, టీ హబ్‌లను సందర్శించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎం.సీత, ఇన్నోవేషన్ డీన్ డాక్టర్ ఎస్.కల్యాణి, సీఎస్ఈ హెచ్ఓడీ డాక్టర్ ఏ.శారద, ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్స్ డాక్టర్ బీవీఎల్. పరమేశ్వరి, డాక్టర్ జీ మాలినిదేవి, వై.శ్రావణిదేవి పాల్గొన్నారు.

నేడు పాతబస్తీకి గో రక్ష మహా పాదయాత్ర

చార్మినార్: గో రక్షణ, భూ రక్షణ, పర్యావరణ రక్షణ కోసం గో రక్ష మహా పాదయాత్ర నిర్వహిస్తున్న బాలకృష్ణ గురుస్వామి చేస్తున్న మహా యజ్ఞానికి సహకరించాలని మీరాల మండి శ్రీ మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య కోరారు. 6 నెలలుగా దీక్షతో 87 రోజుల క్రితం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్రగా బయలుదేరగా ఆదివారం చార్మినార్‌కు చేరుకుంటుందన్నారు. చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి ఆదివారం ఉదయం గో మహా హారతి నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర ఆలయాన్ని సందర్శించనున్నారన్నారు. పలు ప్రత్యేక పూజలు.. అనంతరం భోజనాలు ఉంటాయని తెలిపారు.

జాతీయ పుస్తక ప్రదర్శనలో తెలుగు వర్సిటీ ప్రచురణలు



బుక్‌స్టాల్‌ను సందర్శిస్తున్న ఆచార్య వెలుదండ నిత్యానందరావు

నాంపల్లి: ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న 37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఆ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు తెలిపారు. శనివారం వర్సిటీ పుస్తక విక్రయశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 29 వరకు ప్రదర్శన కొనసాగుతుందని, రాయితీ ధరల్లో పుస్తకాలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక విక్రయ కేంద్రంలోనూ పని వేళల్లో లభ్యం అవుతాయని తెలిపారు.

వార్షికోత్సవ వేడుకలు



నాంపల్లి: లాస్య రంజని క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ (శేరిలింగంపల్లి) దశమ వార్షికోత్సవ వేడుకలను నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య గురువు రేఖ గరిషకుర్తి ఆధ్వర్యంలో 28 మంది అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన ఆంధ్రనాట్య ప్రదర్శన ఆకట్టుకున్నది. పద్మశ్రీ ఉమా మహేశ్వరి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ, కళా పత్రిక సంపాదకుడు మహ్మద్ రఫీ, రిటైర్డ్ సైంటిస్ట్ (ఐఎస్ఆర్ఓ) దేవీ ప్రసాద్ హాజరై ప్రసంగించారు. వ్యాఖ్యతగా పేరిణి పవన్ కుమార్ వ్యవహరించారు.

వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

చాంద్రాయణగుట్ట: వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయమని లాల్‌దర్వాజా పూల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బాశెట్టి లెనిన్ బాబు అన్నారు. ఆలయ ఆవరణలో కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, భక్తులకు పలు రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం లెనిన్ బాబు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్

యాకుత్‌పురా: బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. ఇటీవల యాకుత్‌పురా ఈస్ట్ చంద్రనగర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి ఆర్థికంగా నష్టపోయిన బాధిత కుటుంబాన్ని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి శుక్రవారం రాత్రి పరామర్శించారు. ఆయన వెంట యాకుత్‌పురా మజ్లిస్ ఇన్‌చార్జి యాసర్ అరాఫత్, నాయకులు పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

గౌలిపురా: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను ఛత్రినాక చౌరస్తాలో శనివారం దహనం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ యూత్ రాష్ట్ర కార్యదర్శి శశియాదవ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కల్యాణ్ యాదవ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి లడ్డూ పటేల్, యాకుత్‌పురా అసెంబ్లీ అధ్యక్షుడు సాయియాదవ్, యూత్ కాంగ్రెస్ గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు సురేశ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కార్తీక్, చాంద్రాయణగుట్ట ఉపాధ్యక్షులు నరసింహ, సందీప్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డల్లు శివ, కుర్మగూడ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్, యూత్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణ యాదవ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఛత్రినాక ఇన్‌స్పెక్టర్‌గా నాగేంద్ర ప్రసాద్ వర్మ



చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కే నాగేంద్ర ప్రసాద్ వర్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సౌత్‌జోన్ కంట్రోల్ రూంకు బదిలీ కావడంతో, 2009 బ్యాచ్‌కు చెందిన ప్రసాద్ వర్మ ఇక్కడికి వచ్చారు. ఈయనతో పాటు డీఐగా 2009 బ్యాచ్‌కే చెందిన సి.శోభన్ బాబు కూడా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఐగా పనిచేసిన ఎస్.రాము షాహినాయత్‌గంజ్ ఠాణాకు డీఐగా బదిలీ అయ్యారు. కేఎన్.ప్రసాద్ వర్మ గతంలో చాంద్రాయణగుట్ట ఎస్‌హెచ్‌వో, అదనపు ఇన్‌స్పెక్టర్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తానన్నారు.



సమస్యలు పరిష్కరించాలని వినతి



డిఫెన్స్ ఎస్టేట్ ఆఫీసర్ బి. రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

గోల్కొండ: గోల్కొండ మహ్మదీ లైన్స్‌లోని పాత మిలట్రీ క్వార్టర్స్‌లో సమస్యలు పరిష్కరించాలని ఆ క్వార్టర్స్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు డిఫెన్స్ ఎస్టేట్ ఆఫీసర్ బీ రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు షేహబాజ్, షకీల్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాత మిలట్రీ క్వార్టర్స్‌ను వాటి యజమానులకే కేటాయిస్తు జీవో జారీ చేశారన్నారు. అయితే మిలట్రీ అధికారులు మాత్రం జీవోను అమలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం ఇండ్లు శిథిలావస్థకు చేరుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎస్టేట్ అధికారి వారికి హామీ ఇచ్చారు.

నేడు జియాగూడలో కనకదాస్ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న నాయకులు

జియాగూడ: జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో శ్రీ కనకదాస్ 537వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు జియాగూడ శ్రీ మల్లన్న కురుమ సంఘం అధ్యక్షుడు హన్మంత్ హీరోడే, ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ హీరోడే తెలిపారు. కేశవస్వామి మందిరంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం సాయంత్రం 4 గంటలకు జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు శ్రీ శాంతామయ స్వామిజీ, తెలంగాణ కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గే మల్లేశం, ఎంపీ ఈటల రాజేందర్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ తదితరులు హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు.



కృష్ణవేణిలో 'సైన్స్ అండ్ మ్యాథ్స్ ఎక్స్‌పో'



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న టీచర్లు

గౌలిపురా: హనుమాన్‌నగర్‌లోని ఛత్రినాక కృష్ణవేణి పాఠశాలలో శనివారం సైన్స్ అండ్ మ్యాథ్స్ ఎక్స్‌పోను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలోచింపజేసే రీతిలో పలు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయులు గౌతం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



తయారు చేసిన మోమోస్‌తో విద్యార్థులు



స్వీట్ కార్న్‌తో విద్యార్థినులు..

గోల్కొండ: విద్యాశాఖ ఆదేశాల మేరకు గోల్కొండలోని ముఫీద్ ఉన్ నిస్వాన్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరి చొప్పున విద్యార్థులు టీంగా ఏర్పడి రుచికరమైన వంటకాలను సిద్ధం చేశారు. కార్యక్రమానికి సెకండ్ లాన్సర్ బాలుర ప్రభుత్వోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ హాజరై ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు తయారు చేసిన వంటకాలు, తినుబండరాళ్ల రుచిని ఆస్వాదించారు. పిస్తా, నూడుల్స్, స్వీట్ కార్న్, హైదరాబాదీ తహరీ, మోమోస్‌ల రుచిని చూసి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహ్మద్ ఇష్తేకార్ అహ్మద్, మహేశ్వర్‌రావు, సాజీద్, సయ్యద్ అబ్దుల్ వాజీద్ హాష్మి, మజ్లిస్ ఏరియా అధ్యక్షుడు సయ్యద్ ఆలీ, షేహనాజ్ బేగం, జరీనా, ఫర్హానా, రియాజ్ ఉన్నీసా తదితరులు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని విశ్రాంత మేజర్ జనరల్ మహేంద్ర సూచించారు. రవీంద్రభారతీలో న్యూ ఎరా విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రజ్ఞా మయూఖ్ పేరిట స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్టివల్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రవణ్‌కుమార్, ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ శివనాథ్, కళాశాల డైరెక్టర్ ఎల్‌వీ.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

చార్మినార్: హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన చాకోలెకర్ లక్ష్మి, కోట్ల శ్రీనివాస్, మిగితా డైరెక్టర్లను బహదూర్‌పుర నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి బొకే అందజేసి సత్కరించారు.

పుస్తకావిష్కరణ



తెలుగు ఫాంట్ నోట్‌ను ఆవిష్కరిస్తున్న నందిని సిద్దారెడ్డి

గన్‌ఫౌండ్రీ: శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కవి శీలా వీర్రాజు రూపొందించిన తెలుగు ఫాంట్ ఆవిష్కరణ సభను శనివారం రవీంద్రభారతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిద్దారెడ్డి మాట్లాడుతూ.. శీలా వీర్రాజు రాసిన ఎన్నో పుస్తకాలు సమాజాన్ని మేల్కొలిపాయని కొనియాడారు. అనంతరం ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రదేవి రచించిన 'మాట్లాడడానికో మనిషి కావాలి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి సుధామ, వురుషోత్తం కుమార్, డాక్టర్ అమృతలత, పుష్పాల శ్రీరామ్, శీలా పల్లవి తదితరులు పాల్గొన్నారు.